వివాహం కావడం లేదని మహిళ ఆత్మహత్య

బెల్లంపల్లిరూరల్, మార్చి 17: బెల్లంపల్లి పట్టణంలోని టేకులబస్తీకి చెందిన కొత్తూరు సుమలత (38) వివాహం కావడం లేదని తీవ్ర మనస్తాపానికి గురై ఆదివారం బెల్లంపల్లి గంగారాంనగర్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నది. వివాహం కావడం లేదని కొంతకాలంగా మనోవేదనకు గురవుతున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దస్తావేజు లేఖరుల కార్యాలయాలు బంద్

హాజీపూర్, మార్చి 17 : నేటి నుంచి ఈ నెల 30వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని దస్తావేజు లేఖరుల కార్యాలయాలను మధ్యాహ్నం 1 గంట వరకు బంద్ ఉంచుతున్నట్లు దస్తావేజు లేఖరుల సంఘం అధ్యక్షుడు దీపక్ ఉపాధ్యాయ ఆదివారం తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆనుకొని కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయడంతో విద్యార్థుల పరీక్షలను దృష్టిలో ఉంచుకొని స్వచ్ఛందంగా తమ కార్యాలయాలను మూసి వేస్తున్నట్లు తెలిపారు. తిరిగి మధ్యాహ్నం తెరుస్తామని తెలిపారు. భూముల క్రయ విక్రయాలను నిర్వహించే వారు తమ భూముల రిజిస్ట్రేషన్ కోసం మధ్యాహ్నం 1 గంట తర్వాత కార్యాలయానికి రావాలని సూచించారు.

గురుకులాల్లో బ్యాక్‌లాగ్ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

బెల్లంపల్లిరూరల్, మార్చి 17: తెలంగాణ సాంఘిక సంక్షేమ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024-2025 విద్యాసంవత్సరానికి గానూ 6, 7, 8. 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భరీత కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కాసిపేట బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్‌కుమార్ తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 23వ తేదీలోగా తమ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ 21 న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆయన తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
ఉచిత శిక్షణ-ఉపాధి
jobs Apply Now!
★Solar, 5G, Drone, Hardware లతో పాటు కంప్యూటర్‌లో ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశం కల్పించబడును. Cont: PMKK, కోటక్ మహింద్ర బ్యాంక్ ఎదురుగా, మంచిర్యాల. సెల్: 7095780999, 7095906999, 7095807999.
NTK-311116
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

జన్నారం మాకులపేట బీట్‌లో ఎండిన ఆకులను వరుసగా పోసి కాల్చుతున్న కూలీ

అగ్ని ప్రమాదాల నివారణకు 'కవ్వాల్'లో ఫైర్‌లైన్స్..

• 3 రేంజ్‌లలో 40 బీట్‌లలో వేసవి దృష్ట్యా చర్యలు • ఎస్ఎన్ పీపీ శాటిలైట్‌తో నిఘా

జన్నారం, మార్చి 17 : వేసవి దృష్ట్యా కవ్వాల్ అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాల నివారించేందుకు ఆ శాఖ అధికారులు ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తున్నారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్‌డ్ ఫారెస్ట్ జన్నారం డివిజన్‌లోని జన్నారం, ఇందన్‌పెల్లి, తాళ్లపేట రేంజ్‌ల్లో 40 బీట్‌లలో ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేశారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఎండిన ఆకులు కాలుతూ మంటలు ఎక్కువ దూరం వ్యాపిస్తాయి. దీని నివారణకు అడవుల్లో రాలిన ఆకులను ఆ ప్రాంతం చుట్టూ ఒక లైన్‌గా కుప్పగా పోసి కాల్చివేస్తున్నారు.

అగ్ని ప్రమాదాలపై శాటిలైట్‌తో నిఘా..

అగ్ని ప్రమాదాల నివారణకు టైగర్ కన్జర్వేషన్ ఆఫ్ అథారిటీ ఎస్ఎన్ పీపీ శాటిలైట్‌ను ఏర్పాటు చేశారు. శాటిలైట్ ద్వారా ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా డెహ్రాడూన్ ఆధ్వర్యంలో కవ్వాల్ అడవిలో ఎక్కడ అగ్ని ప్రమాదాలు జరిగినా వెంటనే ఉన్నత అధికారులకు సమాచారం అందిస్తారు. స్థానిక అటవీ శాఖ అధికారులు, సిబ్బందికి ఫోన్‌లకు ప్రమాద స్థలం వివరాలు అందుతాయి. వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లి మంటలను ఆర్పివేస్తారు.

జన్నారం అడవిలో ప్రధాన రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ఫైర్‌లైన్

అగ్ని ప్రమాదాల నివారణే లక్ష్యం

వేసవి కాలంలో అగ్నిప్రమదాల నివారణే లక్ష్యం ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేశాం. ఎండిన ఆకులను కాల్చివేస్తున్నాం. ముందస్తుగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో బ్లోయర్ యంత్రాల సాయంతో ఎండిన ఆకుల వేరు చేసి ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తున్నాం. అటవీ సమీపంలో గ్రామాల ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నాం.

-హఫీసొద్దీన్, జన్నారం రేంజ్ ఆఫీసర్

మహిళలు అన్ని రంగాల్లో పురోగతి సాధించాలి

• జడ్పీ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి , మాజీ విప్ నల్లాల ఓదెలు

మున్సిపాలిటీ చైర్ పర్సన్ జంగం కళకు అవార్డు ప్రదానం చేస్తున్న జడ్పీ చైర్ పర్సన్ దంపతులు

మందమర్రి, మార్చి 17: మహిళలు అన్ని రంగాల్లో పురోగతిని సాధించి దేశ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని మంచిర్యాల జడ్పీ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ విప్ నల్లాల ఓదెలు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మందమర్రి పట్టణంలోని మంజునాథ గార్డెన్‌లో ఆదివారం ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల సఖీ ఆధ్వర్యంలో నిర్వహించిన రమాబాయి అంబేద్కర్ విశిష్ట పురస్కారాలు-2024 ప్రదానం కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్య, వైద్య, న్యాయ విభాగం, స్వచ్ఛంద, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మహిళలు, మహిళా ప్రజాప్రతినిధులను శాలువాలతో సన్మానించారు. జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రమాబాయి అందించిన ప్రోద్బలంతోనే అంబేద్కర్ మహోన్నతమైన రాజ్యాంగాన్ని మనకు అందించారని, చట్ట సభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నెరువట్ల రాజలింగు, పట్టణ కన్వీనర్ సకినాల శంకర్, కో కన్వీనర్ ఉప్పులేటి నరేశ్, లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల సఖీ అధ్యక్షురాలు బండ శాంకరి, టీఎస్ డబ్ల్యూఆర్ఎస్ ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి, మున్సిపల్ డీఈ సుమతి, క్యాతనపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ జంగం కళ, అర్బన్ ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ గడప మానస తదితరులు పాల్గొన్నారు.

వన్య ప్రాణుల కోసం ఉప్పుగడ్డలు..

జన్నారం, మార్చి 17 :కవ్వాల్ టైగర్ రిజర్వ్‌డ్ ఫారెస్ట్‌లోని ఇందన్‌పెల్లి, జన్నారం, తాళ్లపేట రేంజ్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉప్పుగడ్డలు ఏర్పాటు చేస్తున్నారు. వేసవి నేపథ్యంలో వన్యప్రాణులకు లవణాలను అందించడం కోసం నీటికుంటలు, చెరువుల వద్ద 70 శాతం ఉప్పు, 30శాతం మట్టిని కలిపి ముద్దలా తయారు చేసి అందుబాటులో ఉంచుతున్నారు. దాహం తీర్చుకునేందుకు వచ్చే వన్యప్రాణులు ఆ మట్టిగడ్డను నాకడం వల్ల వాటికి కావాల్సిన లవణాలు అందుతాయని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

కవ్వాల్‌లోని చింతగూడ బీట్ నీటి కుంట వద్ద ఏర్పాటు చేస్తున్న ఉప్పుగడ్డ

కవితాగానం చేస్తున్న కవి

అలరించిన కవి సమ్మేళనం

మంచిర్యాల ఏసీసీ, మార్చి 17: మంచిర్యాల జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం మంచిర్యాల పట్టణంలో కవయిత్రి అడ్డగూరి శ్రీలక్ష్మి స్వగృహంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కవి, జ్యోతిష్య పండితుడు కొమ్మెర విశ్వేశ్వర శర్మ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా నుంచి పద్య, వచన, గేయ కవిత్వం, కథాసాహిత్యం, సాహితీ విమర్శ లాంటి వివిధ ప్రక్రియల్లో నాణ్యమైన సాహిత్యం వస్తుందని కొనియాడారు. పుస్తకాలు ప్రచురిస్తున్న సాహితీవేత్తలకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కవి సమ్మేళనంలో కవులు బెల్లాల సుగుణాకర్, భూపతి సంతోష్, అడ్డగూరి శ్రీలక్ష్మి, వైద్య సుజాత, మేసు మల్లేశం పాల్గొన్నారు.

మతోన్మాద, ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి

• సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ

మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు శ్రీనివాస్

బెల్లంపల్లిరూరల్, మార్చి 17: జాతీయత, దేశభక్తి పేరుతో బీజేపీ అధికారంలో వచ్చిందని, ప్రస్తుతం అవలంబిస్తున్న మతోన్మాద, ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ బెల్లంపల్లి డివిజన్ కార్యదర్శి టీ.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం బెల్లంపల్లిలోని ఇఫ్టూ కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు అనేక హామీలను ఇచ్చి తీవ్రంగా మోసం చేసిందని విమర్శించారు. పదేళ్లలో ప్రభుత్వ రంగ సంస్థలు, ఆస్తులు, సహజ వనరులను కార్పొరేట్ రంగానికి అప్పగించిందని ఆరోపించారు. కార్పొరేట్ రంగం ఆస్తులను, సంపదను పెంచిందన్నారు. కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను అమలుకు పూనుకున్నదని ఆరోపించారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 44 చట్టాలను 4 కోడ్లుగా మారుస్తూ కార్పొరేట్ రంగ ప్రయోజనాల కోసం పార్లమెంట్‌లో చట్టం తెచ్చిందన్నారు. ఈ దేశంలో సహజ వనరులను కొల్లగొట్టడానికి అటవీభూములను ధ్వంసం చేసి గిరిజనుల భూములను స్వాధీనం చేసుకోవడానికి చట్టం చేసిందన్నారు. ప్రధాని మోదీ కార్పొరేట్ సంస్థల ప్రతినిధిగా పని చేస్తున్నారని విమర్శించారు. దేశంలో మతతత్వ దాడులు కొనసాగుతున్నాయని, మైనార్టీలు, దళితులు, ప్రశ్నించే గొంతుకలపై దాడులు తీవ్రతరంగా మారుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి, ఇఫ్టూ నాయకులు రాజు, పీవైఎల్ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు శిరీష

శిరీష

మంచిర్యాల అర్బన్, మార్చి 17 : జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో బీకాం(జనరల్) సెకండియర్ చదువుతున్న జీ శిరీష జాతీయ సీనియర్ ఉమెన్ హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డీ సుమతి తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు దాదా నగర్ హవేలీలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. శిరీషను కళాశాల ప్రిన్సిపాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్ కే శివలీల, పీడీ పద్మ, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

నేడు ఆయుర్వేద వైద్య శిబిరం

సీసీసీ నస్పూర్, మార్చి 17: ఈనెల 18న నస్పూర్‌కాలనీ మనోరంజన్ సముదాయ్‌లో డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు శ్రీరాంపూర్ డీజీఎం పర్సనల్ అరవిందరావు పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. దీర్ఘకాలిక రోగాలైన బీపీ, షుగర్, కీళ్లు, నడుము నొప్పులకు పరీక్షలు చేసి మందులు ఇస్తామని తెలిపారు. సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థిని మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

• విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్
• పోలీసులకు ఫిర్యాదు

పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

మంచిర్యాల ఏసీసీ /మంచిర్యాల అర్బన్, మార్చి 17 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థిని వహిదా అంజూమ్ (18) మృతికి కారకులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తూ ఆదివారం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ఇంటర్ సెకండియర్ విద్యార్థిని ఈ నెల 12వ తేదీ రాత్రి నుంచి అనారోగ్యానికి గురైనప్పటికీ సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆరోగ్యం మరింత క్షీణించిందన్నారు. ఈ నెల 13న ఉదయం మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. ఈ నెల 16న రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందిందన్నారు. విద్యార్థిపై నిర్లక్ష్యం వహించి మృతికి కారణమైన ప్రిన్సిపాల్‌ని సస్పెండ్ చేసి విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన విద్యార్థిని కుటుంబానికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ నాయకులు దాగం శ్రీకాంత్, మిట్టపల్లి తిరుపతి, ఈదునూరి అభినవ్, ఎలుక అరవింద్ రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉండాలి

• సీఐ శశిధర్‌రెడ్డి

కాసిపేట, మార్చి 17 : జరగబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి సూచించారు. ఆదివారం సాయంత్రం కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చొప్పరిపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద సీఐ శశిధర్ రెడ్డి, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ వాహనాల తనిఖీలు చేపట్టారు. వాహనాల్లో ఉన్న సామాగ్రిని పరిశీలించారు. ప్రయాణికుల వివరాలు తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'హ్యాపీ.. హ్యాపీగా పాఠశాల వార్షికోత్సవం

నృత్యం చేస్తున్న చిన్నారులు

మంచిర్యాల అర్బన్, మార్చి 17 : పట్టణంలోని 'ది హ్యాపీ' స్కూలర్ స్కూల్ 22వ వార్షికోత్సవ సంబురాలు పద్మనాయక ఫంక్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు చేసిన శాస్త్రీయ నృత్యాలు, నాటికలు, మార్షల్ ఆర్ట్స్ విన్యాసాలు ఆహూతులను ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఎంఈవో జాడి పోచయ్య, పాఠశాల కరస్పాండెంట్ సీహెచ్ విక్రమ్ రావు, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్ రావు, ట్రెజరర్ శరత్ కుమార్, మండల అధ్యక్షుడు ఉష్మాన్ పాషా, నస్పూర్ మండల సెక్రటరీ తిరుపతి రెడ్డి, రిటైర్డ్ ఏఎస్ఐ సీహెచ్ గౌతంరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులున్నారు.

కుటుంబ కలహాలతో ఆటోడ్రైవర్ ఆత్మహత్యాయత్నం

బెల్లంపల్లిరూరల్, మార్చి 17: ఆటోడ్రైవర్ కుటుంబ కలహాలతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన బెల్లంపల్లి పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వెనుకగల్లీలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఆటోడ్రైవర్ కుమార్ తరచూ మద్యం తాగుతుండడంతో భార్యతో గొడవలు జరుగుతున్నాయి. కాగా కుమార్ భార్య హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నది. మద్యం తాగేందుకు డబ్బులు లేక అనేక సార్లు కుమార్ భార్యతో గొడవ పడేవాడు. ఇటీవల ఇంట్లో భార్య నగలు కూడా అమ్మేశాడు. ఈ విషయమై ఆదివారం ఇంట్లో ఇద్దరికీ గొడవ జరిగింది. కుమార్, భార్యను కొట్టడంతో ఆమె భర్తపై ఫిర్యాదు చేసేందుకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. అంతలోనే కుమార్ ఇంట్లో మందు తాగి, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తాను గడ్డిమందు తాగినట్లు పోలీసులకు తెలిపాడు. దీంతో పోలీసులు వెంటనే కుమార్‌ను చికిత్స కోసం బెల్లంపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు. తన భర్త కుమార్ తరచూ మద్యం తాగి తనను వేధిస్తున్నాడని, ఇతరులతో వివాహేతర సంబంధాలు అంటగడుతున్నాడని ఆదివారం రాత్రి, కుమార్ భార్య వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

రేపు వేలం పాట

చెన్నూర్, మార్చి 17: చెన్నూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో ఈ నెల 19న తైబజార్, పశువుల సొంత నిర్వహణ కోసం వేలం పాట నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగాధర్ తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు మున్సిపాలిటీకి ఎలాంటి బకాయిలు లేనట్లు సర్టిఫికెట్‌తో పాల్గొనాలని సూచించారు.

లక్ష్మీ దేవికి వైభవంగా జలాభిషేకం

భీమారం,మార్చి 17 : భీమారం మండల కేంద్రంలోని ముదిరాజ్ కాలనీలో లక్ష్మీ దేవి ఆలయంలో సోమవారం జరిగే బోనాల పండుగా సందర్భంగా ఆదివారం భక్తులు తెల్లవారుజామున 3 గంటల నుంచి కాలినడకన చెన్నూర్ గోదావరికి వెళ్లి స్నానాలు ఆచారించారు. అనంతరం లక్ష్మీ దేవికి నదిలో జలాభిషేకం చేశారు. తిరిగి కాలినడకన భీమారానికి చేరుకున్నారు. దాదాపు 30 కిలో మీటర్లు కాలినడకన నడిచి పుణ్య స్నానాలు చేశారు. రాత్రి పూట భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

డప్పు చప్పుళ్లతో లక్ష్మీ దేవిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న ముదిరాజ్ కులస్తులు

సింగరేణి

ఎస్టీపీపీ సందర్శన

మినిస్ట్రీ ఆఫ్ కోల్ ఇండియా అదనపు సెక్రటరీ విస్మితాతేజీతో అధికారులు

జైపూర్, మార్చి 17: జైపూర్‌లోని ఎస్టీపీపీని ఆదివారం మినిస్ట్రీ ఆఫ్ కోల్ ఇండియా అదనపు సెక్రటరీ విస్మితాతేజ్ (ఐఆర్ఎస్) సందర్శించారు. విద్యుత్ కేంద్రంలో సింగరేణి సీఎండీ బలరాం, ఈడీ బస్వీరెడ్డి పుష్పగుచ్ఛం అందించి ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్లాంట్‌ను పరిశీలించారు. ఉత్పత్తి వివరాలు తెలుసుకున్నారు. అతిథి గృహంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎండీ బలరాం మాట్లాడుతూ ఎస్టీపీపీలో సుమారు రూ. 700 కోట్లతో ఎఫ్‌జీడీ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామని, ఇది జూన్‌లోగా పూర్తిచేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. త్వరలో 800 మెగావాట్లు నూతన ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నామని, గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్,, మిథనాల్ ప్లాంట్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నామని, దీని ద్వారా కార్బన్ డై ఆక్సైడ్‌ను మిథనాల్‌గా మార్చవచ్చన్నారు. ఈడీ బస్వీరెడ్డి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్లాంట్ కోల్ రిక్వైర్మెంట్ 4.7 మిలియన్ టన్నులుగా ఉందని, ప్లాంట్ కాస్ట్ రూ.8584 కోట్లు అని, యేటా మన ప్లాంట్ ఇండియాలోనే టాప్ టెన్ ర్యాంకింగ్స్‌లో ఉంటుందని విస్మితాతేజ్‌కు వివరించారు. బూడిద వినియోగంలో 100 శాతం ముందున్నట్లు తెలిపారు. సోలార్ పవర్ ప్లాంట్‌ను గ్లాసిఫ్ మోడ్‌లో ఏర్పాటు చేశామని, తద్వారా ఎక్కువ యూనిట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నామని తెలిపారు. అనంతరం ప్లాంట్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్ శ్రీనివాస్, శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, చీఫ్ఆఫ్‌వో అండ్ఎం జైన్‌సింగ్ పాల్గొన్నారు.

కొత్త గనులతోనే సింగరేణికి భవిష్యత్

• సింగరేణిలో రాజకీయ జోక్యం వద్దు
• ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య

మాట్లాడుతున్న ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య

శ్రీరాంపూర్, మర్చి 17 : సింగరేణి సంస్థలో కొత్త గనులు ఏర్పాటుతోనే భవిష్యత్ ఉంటుందని, దీంతో కొత్త ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ సీతారామయ్య పేర్కొన్నారు. ఆదివారం శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలోనే సింగరేణికి ఇచ్చిన తాడిచర్ల 2 బ్లాక్ తిరిగి సంస్థకు అప్పగించినట్లు తెలిపారు. మిగిలిన 3 బ్లాకులు కూడా సింగరేణికి కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్రం, సీఎం, మంత్రులకు లేఖలు రాసినట్లు తెలిపారు. కొత్త ప్రాజెక్టులు సాధించేందుకు యాజమాన్యం వేలంలో పాల్గొని దక్కించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు టెండర్లలో పాల్గొనడానికి రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం సానుకూలంగా ఉన్నాయని చెప్పారు. తాడిచర్ల బ్లాక్ సింగరేణికి రావడం వల్ల 600 ఉద్యోగాలు లభిస్తాయన్నారు. సింగరేణిలో సర్వేస్ జనరల్ మజ్దూర్లు 108 పోస్టులు భర్తీ చేయడానికి యాజమాన్యం అన్ని కేటగిరీల వారికి అనుమతి ఇవ్వడానికి అంగీకరించిందన్నారు. కార్మికుల ఉద్యోగ అర్హత వయసు 35 నుంచి 40 సంవత్సరాలకు పెంపునకు హామీ ఇచ్చిందన్నారు. మారుపేర్ల సవరణకు ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. పెండింగ్‌లో ఉన్న సీఎంపీఎఫ్ రుణాలు త్వరలోనే ఇవ్వడానికి ట్రస్ట్ హామీ ఇచ్చిందన్నారు. బదిలీల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూస్తున్నామన్నారు. క్వార్టర్లు రిపేరు చేయించిన తర్వాతే కార్మికులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అధికారులు బదిలీల్లో నిబంధనలు అతిక్రమిస్తే ఊరుకోబోమన్నారు. సింగరేణిలో 1000 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినట్లు తెలిపారు. అంతర్గత కార్మికులకు ముందుగా 60 శాతం, బయటి వారికి 40 శాతం అవకాశాలు కల్పించాలన్నారు. ఈ మేరకు 300 అంతర్గత పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినట్లు తెలిపారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందన్నారు. ఎమ్మెల్యేల పేరు చెప్పి అధికారుల వద్ద అజమాయిషీ చెలాయిస్తున్నారని ఆరోపించారు. తాము ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా తాను ఎవరికీ ఏ విషయంలో అధికారులకు చెప్పలేదని పేర్కొన్నట్లు చెప్పారన్నారు. అధికారులు కూడా వారి తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. అక్రమాలు జరగకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, సహాయ కార్యదర్శి కొంరయ్య, ఫిట్ కార్యదర్శులు నర్సింగారావు, బద్రీ బుచ్చయ్య, శివకుమార్, రాంచందర్, యాదగిరి, నగేశ్, సంగం సదానందం, సతీశ్, అఫ్రోజ్‌ఖాన్, సురేశ్ పాల్గొన్నారు.

కనీస వేతనాల కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

శ్రీరాంపూర్, మార్చి 17 : తెలంగాణా రాష్ట్ర కనీస వేతనాల బోర్డు కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన ఐఎన్‌టీయూసీ ప్ర